చిన్నారుల పార్కుకు మోక్షమెప్పుడు?


పార్కు ముఖ ద్వారం


కూలిన ఇందిరా గాంధీ చిల్డ్రన్ పార్కు రక్షణ గోడ


విరిగిపోయిన ఆట వస్తువులు


పాడైన ఏనుగు బొమ్మ


రంధ్రం పడిన జారుడు బల్ల

బీచ్ రోడ్డు: తీరం చెంతన ఆహ్లాదకర వాతావరణంలో ఉన్న ఇందిరా గాంధీ చిల్డ్రన్ పార్కు ఇప్పుడు చిన్నారుల సందడి లేక వెలవెలబోతోంది. కొన్నాళ్ల నెలల కిందట అలల తాకిడికి పార్కు రక్షణ గోడ కోతకు గురై మొత్తం పగిలిపోయింది. ఆట వస్తువులు పాడైపోయాయి. చాలా పరికరాలు విరిగిపోయి అధ్వానంగా తయారయ్యాయి. సాగరతీరంలో మొత్తం మరమ్మతులు చేపట్టి అందంగా తీర్చిదిద్దారు. పలు పార్కులను కూడా సుందరంగా ముస్తాబు చేశారు. కానీ ఆర్కే బీచ్ సమీపంలోని ఈ పార్కును మాత్రం జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యం చేశారు. పార్కు బయట రంగుల వేసి విడిచిపెట్టేశారు. పార్కులో పాడైన ఆట వస్తువుల స్థానంలో కొత్తవి ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. రక్షణ గోడ నిర్మాణాన్ని పూర్తిగా గాలికి వదిలేశారు. దీంతో చిన్నారులను పార్కులోకి తీసుకెళ్లడానికి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పార్కులో సదుపాయాల కల్పనతో పాటు రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: ఆరిలోవ ఫీడర్ 33/11 సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మరమ్మతు పనులు చేపట్టనున్నారు. దీంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతపాలెం, తోటగరువు, రవీంద్రనగర్, గాంధీనగర్, అన్నానగర్, బాలాజీనగర్, శ్రీహరినగర్, కై లాసనగర్, ముస్తఫాకాలనీ, తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

చురుగ్గా డ్రైనేజీ మరమ్మతులు


డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న పల్లా దుర్గారావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్ ఫ్యాకర్ లేఅవుట్ ప్రాంతంలో డ్రైనేజీ సమస్య ఉందని స్థానికులు కార్పొరేటర్ అప్పలకొండ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆమె జీవీఎంసీ అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేపట్టాలని కోరారు. శుక్రవారం శరవేగంగా సాగుతున్న ఈ పనులను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు పర్యవేక్షించారు.

ఫాస్ట్ ఫుడ్ షాపు దగ్ధం


మంటల్లో దగ్ధమైన షాపు

బీచ్ రోడ్డు: బీచ్ రోడ్డులో ఓ ఫాస్ట్ ఫుడ్ షాపు దగ్ధమైంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వైఎంసీఏ దగ్గర అరవింద్ అనే యువకుడు ఫాస్ట్ ఫుడ్ కోర్టు షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా షాపు నుంచి మంటలు వ్యాపించాయి. రాత్రి విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది గమనించి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చేటప్పటికే షాపు పూర్తిగా దగ్ధమైంది. షాపును మూడు రోజులుగా తెరవడం లేదని, దీనికి విద్యుత్ సదుపాయం కూడా లేదని, ఎవరో కుట్రతోనే షాపును దగ్ధం చేశారని అరవింద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

మహారాణిపేట : మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ కోరారు. అమరావతిలోని సచివాలయంలో మత్స్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎ.బాబుతో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై జానకీరామ్, ఇతర బోట్ల యజమానులు శుక్రవారం సమావేశమయ్యారు. ఇటీవల తుఫాన్ సమయంలో గోపాల్‌పూర్ పోర్టులోకి విశాఖపట్నం ఫిషింగ్ బోట్లను అనుమతించకుండా ఇబ్బంది పెట్టిన విషయాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తెచ్చారు. రాళ్లు విసిరి పోర్టు వెలుపలకు ఫిషింగ్ బోట్లను ఘోరంగా పంపించడంతో మత్స్యకారుల ప్రాణానికి రక్షణ లేకుండా పోయిందన్నారు. మరోవైపు 2 వేల మంది మత్స్యకారులు మత్స్యకార భరోసాకు అనర్హులని విశాఖ జిల్లా మత్స్యశాఖ జేడీ కార్యాలయం ప్రకటించడంతో ఎంతో మంది నష్టపోతారన్నారు. మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్లకు ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని కోరారు. దీనిపై ప్రిన్సిపల్ సెక్రటరీ స్పందించారని, గోపాల్‌పూర్ పోర్టుకి వెళ్లే మత్స్యకారులను ఇబ్బంది పెట్టొద్దని గంజాం జిల్లా కలెక్టర్‌కి, ఒడిశా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి లేఖ రాస్తామన్నారని జానకీరామ్ తెలియజేశారు.

వచ్చే నెల 17 నుంచి మిలీనియం ఆప్టిట్యూడ్ టెస్ట్


ఎంఏటీ-2024 పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావు

ఆరిలోవ: మిలీనియం ఆప్టిట్యూడ్ టెస్ట్–2024 పోస్టర్(ఎంఏటీ)ను శుక్రవారం మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఏయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్టిట్యూడ్ పరీక్షలు మనలో సహజ ప్రతిభ, బలం, పరిమితులను బహిర్గతం చేస్తాయన్నారు. మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో మ్యాట్(ఎంఏటీ) నిర్వహిస్తుందని తెలిపారు. గతేడాది 3500 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కాగా.. 1000 మంది మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారన్నారు. ఈ ఏడాది ఎంఏటీ–2024లో అర్హత సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనాలుగా రూ.50 లక్షలు బహూకరిస్తామన్నారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి శని, ఆదివారాలలో ఆగస్టు 17 నుంచి సెప్టెంబరు 30 వరకు ఈ పరీక్ష నిర్వహించనున్నామన్నారు. పూర్తి వివరాల కోసం 92487 53099 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

జూలో చిత్ర లేఖన పోటీలు రేపు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో ఆదివారం విద్యార్థులకు పులులపై చిత్ర లేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఒకటో తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పోటీలు జూలో జరుగుతాయన్నారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు పులులు, వాటి పిల్లలు, 6 నుంచి 10వ తరగతి వరకు పులులపై మానవ ప్రభావం, ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు పులులపై వాతావరణ మార్పులు అనే అంశాలుపై చిత్రాలు వేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 29న ఫొటోగ్రఫీ పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు, పాల్గొన్న అందరికీ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

పొగాకు వినియోగంతో క్యాన్సర్ ముప్పు


టీ దుకాణం వద్ద టీ కప్పులతో హెచ్‌సీజీ సిబ్బంది, స్థానికులు

ఆరిలోవ: క్యాన్సర్ బారిన పడకుండా పొగాకుకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని హెల్త్ సిటీలో హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది టి కప్పులతో శుక్రవారం ప్రచారం చేపట్టారు. ప్రజలకు ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించడానికి 'హేవ్ మోర్ టీ, నో మోర్ పఫ్స్' పేరుతో వినూన్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా టీ దుకాణాల వద్ద స్థానికులకు ఆరోగ్యకరమైన టీ కప్పులు పంపిణీ చేశారు. హెల్త్ కేర్ గ్లోబల్(హెచ్‌సీజీ) ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ రీజనల్ బిజినెస్ హెడ్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ చాలా మంది టీ తాగుతూ సిగరెట్లు కూడా కాల్చుతుంటారన్నారు. ఇలా చేయడం చాలా ప్రమాదకరమన్నారు. టీ మాత్రమే తాగాలని, సిగరెట్లు ఎట్టి పరిస్థితిలోనూ తీసుకోవద్దని ఆయన సూచించారు. పొగాకు తాగడం వల్ల క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు.

కంబాలకొండలో జింకల సందడి


కంబాలకొండ పార్కు లోపలకు వచ్చిన జింకలు

ఆరిలోవ: కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో శుక్రవారం చుక్కల జింకలు సందడి చేశాయి. విశాలమైన కొండల పైనుంచి వచ్చిన ఈ జింకలు సందర్శకులను అలరించాయి. చెంగుచెంగున ఎగిరి వచ్చి పచ్చిక మేసి కనువిందు చేశాయి. సందర్శకులు వాటికి బిస్కెట్లు తినిపిస్తూ ఫొటోలకు దిగారు. కంబాల కొండల్లో వందల సంఖ్యలో చుక్కల జింకలు, కనుజులు, అడవి పందులు ఉన్నాయి. ఇవి ఆహారం, నీటి కోసం కొండల నుంచి కిందకు తరచూ దిగుతుంటాయి. సందర్శకులు వేసిన ఆహారం తినడం, ముళ్ల పొదల్లో పచ్చిక మేసి, కొలనులో నీరు తాగి మళ్లీ కొండలపైకి పరుగులు తీస్తుంటాయి. ఒక్కోసారి జాతీయ రహదారిపై చేరుకుని అక్కడ రోడ్డు పక్కన పచ్చిక మేస్తూ వాహనచోదకులను కూడా కనువిందు చేస్తుంటాయి. అటువంటి సమయంలో ప్రమాదాల బారిన పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.

రైతుబజారు స్టాళ్లకు డ్రా

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులోని స్టాళ్లకు శుక్రవారం ఈవో కొండబాబు డ్రా తీసి రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. ఉదయం రైతులు 95 మందికి 63 స్టాళ్లు, సాయంత్రం రైతులు 65 మందికి 63 స్టాళ్లు కేటాయించామన్నారు. కార్యక్రమంలో రైతుబజారు సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం


ఆరిలోవ టీఐసీ పాయింట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేసిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ఆరిలోవ సీపీఎం జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం టీఐసీ పాయింట్ వద్ద ధర్నా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలవరం నిర్వాసిత ప్రాంతంలో ప్రజలకు నష్టపరిహారం ఇవ్వాలని, విశాఖకు రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డీఏ సర్కారుకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మద్దతుగా ఉన్నప్పటికీ రాష్ట్రానికి బడ్జెట్‌లో ఎలాంటి మేలు చేకూరలేదన్నారు. రాష్ట్రానికి అప్పులు తప్పా ఎలాంటి నిధులు కేటాయించుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. అయినా కూటమిలోని టీడీపీ, జనసేన పార్టీలు నోరు మెదపడటం లేదని ఆరోపించారు. ఉత్తరాంధ్రకు స్పష్టంగా నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. రైతులు, కార్మికులకు ఈ బడ్జెట్ వ్యతిరేకంగా ఉందన్నారు. కార్పొరేట్ శక్తులకు మాత్రమే అనుకూలంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆరిలోవ జోన్ సీపీఎం నాయకులు నరేంద్రకుమార్, రంగమ్మ, శంకరరావు, సత్యనారాయణ, కాంత, తులసి, రామ్, తదితరులు పాల్గొన్నారు.

మడ అడవులతో తీర భద్రత


బీచ్‌లో అవగాహన కల్పిస్తున్న సభ్యులు


సమత కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జూ ఎడ్యుకేషన్ అధికారి దివ్య

బీచ్ రోడ్డు: మడ అడవులతో తీర ప్రాంతం కోతకు గురికాకుండా ఉంటుందని క్లైమేట్ ఫ్రంట్ వైజాగ్ గ్రూప్ ప్రతినిధి ఒయింద్రిలా అన్నారు. ప్రపంచ మడ అడవుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్కేబీచ్‌లో వాటి పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మడ అడవుల వల్ల తాబేళ్లు, పక్షులు వంటి వన్యప్రాణులు జీవించవచ్చన్నారు. అభివృద్ధి పేరిట మడ అడవులను నరకటం పర్యావరణానికి హానికరమన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అంజనా, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సమత కళాశాలలో..

ఎంవీపీ కాలనీ: స్థానిక సమత కళాశాలలో మడ అడవుల సంరక్షణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కు యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు మడ అడవుల సంరక్షణపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జూ ఎడ్యుకేషన్ అధికారి దివ్య మాట్లాడుతూ మడ అడవులు నదీ జలాలు సముద్రంలో కలిసే ప్రాంతాలలో ఉప్పునీటి ప్రభావాన్ని తట్టుకుని పెరిగే వృక్షజాతి అడవులన్నారు. ఇవి విశిష్టమైన జీవ సంపదకు నెలవుగా ఉండటంతో పాటు తుఫానులు, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. భౌగోళికంగా ఎంతో ప్రాధాన్యత ఉన్న మడ అడవులను సంరక్షించం అందరి బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో స్నేహభావంతో మెలగాలి

- సీపీ శంఖబ్రత బాగ్చి
- న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సందర్శన


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

పెదగంట్యాడ: ఫిర్యాదుదారుల పట్ల స్నేహభావంతో మెలగాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సిబ్బందికి సూచించారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. స్టేషన్ అధికారులు, సిబ్బంది ఫిర్యాదుదారులతో ప్రవర్తిస్తున్న తీరును పరిశీలించారు. స్టేషన్‌ను ఆనుకుని ఉన్న ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా శుభ్రం చేయించి, మొక్కలు నాటాలని ఆదేశించారు. స్టేషన్ లోపల అన్ని ప్రాంతాలు పరిశీలించారు. స్టేషన్‌తో పాటు మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. స్టేషన్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో మాట్లాడారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను పారదర్శకంగా విచారణ చేసి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బంది విద్యార్హతలు తెలుసుకుని, వారి పనితీరుపై ఆరా తీశారు. వారికి పలు సూచనలు చేశారు. స్టేషన్ ఆవరణలో ఉన్న సీజ్ చేసిన వాహనాలు పాడవకుండా చర్యలు చేపట్టాలన్నారు. క్రైం ప్రివెన్షన్, డిటెక్షన్, ప్రాసిక్యూషన్‌కు ఎంతో ఉపయోగపడే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. గంజాయి రవాణా చేసిన, నిల్వ చేసిన వారిని అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

దొండపర్తి యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో


దొండపర్తిలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: దొండపర్తి యూపీహెచ్‌సీ పరిధిలోని పలు వీధుల్లో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు పర్యటించి, నీటి నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, గర్భిణుల జాబితా తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లు ఎనీమియా బాధితులను గుర్తించి వారికి మాత్రలు అందజేయాలని తెలిపారు. అన్ని యూపీహెచ్‌సీల్లోనూ సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సీ–సెక్షన్ ప్రసవాలను నివారించాలని ఆరోగ్య సిబ్బంది, వైద్యులను కోరారు. అందరూ సమయపాలన పాటించాలని, స్టాఫ్ డయేరియా ప్రొగ్రాం మీద అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వర్షా కాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని చెప్పారు. దోమల నిర్మూలనకు శుక్రవారం డ్రైడే–ఫ్రైడే పాటించాలని స్థానిక ప్రజలను డీఎంహెచ్‌వో కోరారు. జిల్లా మలేరియా అధికారి తుల సీరాజ్, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) ఎం.నాగేశ్వరరావు, ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 31.2 కిలోల గంజాయి పట్టివేత


రైల్వే పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న యువకులను రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది విశాఖ రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన ఆకాష్, పాడువకు చెందిన భీముండు, హర్యానాకు చెరందిన అవినాష్, బీహార్‌కు చెందిన అమృత్‌కుమార్, కేరళకు చెందిన టామ్ అలెక్స్‌లు అక్రమంగా గంజాయిని రవాణా చేయడం గుర్తించారు. వీరు ఈ గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా కేరళ, కర్ణాటక, హర్యానా, బిహార్ రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి సుమారు రూ.1,04,500 విలువైన 31.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

15.61 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అరెస్ట్ చేశారు. రామాటాకీస్ రోడ్డులోని ప్రభుత్వ కంటి ఆస్పత్రి ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లు సమాచారంతో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. సుమారు 15.61 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేరళ రాష్ట్రం త్రిశూల్‌కు చెందిన సఫాల్ సలీం, సునీల్‌కుమార్, అబిన్ సుబ్రాన్‌లు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్ టి.వెంకటప్పలనాయుడు, ఎస్ఐ, ఎస్.మునసలనాయుడు, డీటీఎఫ్ ఎస్ఐ వేణుగోపాల్, హెచ్‌సి.శ్రీనివాస్, (టాస్క్‌ఫోర్స్) కానిస్టేబుళ్లు అప్పలనాయుడు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ టెక్నీషియన్లను ప్రభుత్వం ఆదుకోవాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్

సీతంపేట: విశాఖలో పనిచేస్తున్న సెల్‌ఫోన్ టెక్నీషియన్లు అందరూ ఒక తాటిపై నడిచి తమ భవిష్యత్‌ను కాపాడుకోవాలని టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలో సెల్‌ఫోన్ వృత్తిలో ఉన్న టెక్నీషియన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. సెల్‌ఫోన్ టెక్నీషియన్లను కార్మికులుగా గుర్తించి విశ్వకర్మ యువజన పథకం కింద సదుపాయాలు కల్పించాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సెల్‌ఫోన్ టెక్నీషియన్లకు ట్రైనింగ్ అందించి ఉపాధి కల్పించాలన్నారు. ఇప్పటివరకు విశాలో 250 మందికి సభ్యత్వం ఇచ్చామని, ఈ నెలాఖరులోగా 400 మంది వరకు సభ్యులుగా చేరే అవకాశం ఉందని చెప్పారు. సెల్‌ఫోన్ టెక్నీషియన్లకు ఎప్పుడూ సొసైటీ సహాయ సహకారం ఉంటుందని తెలిపారు. సమావేశంలో యూనియన్ నాయకులు ప్రసాదు, దాము, రాజేష్, అహ్మద్, అమ్రుష్, వివిధ జిల్లాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం రేపు


కరపత్రికను ఆవిష్కరిస్తున్న కేంద్ర గౌరీ సేవా సంఘం ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: కేంద్ర గౌరీ(గవర) సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ గవర విద్యార్థులకు ఈ నెల 28న బహుమతుల ప్రదానోత్సవం, అభినందన సభ నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు బుద్ధ శివాజీ తెలిపారు. అక్కయ్యపాలెం జాతీయ రహదారి పక్కన గల పోర్టు కళావాణి ఆడిటోరియం(విశ్వనాథ్ కన్వెన్షన్స్)లో ఆదివారం ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రైల్వే న్యూకాలనీలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ముందుగా వివరాల కరపత్రికను ఆవిష్కరించారు. శివాజీ మాట్లాడుతూ ఈ ఏడాది విడుదలైన పరీక్షా ఫలితాల్లో 80 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన సుమారు 600 మంది గవర సామాజిక వర్గ విద్యార్థులకు బహుమతులు, దరఖాస్తు చేసుకున్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులను అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చ అప్పారావు, ఉపాధ్యక్షులు మొల్లేటి వీరకుమారస్వామి, వేగి సత్యనారాయణ పాల్గొన్నారు.